80

# చేదు విషం... జీవఫలం!

సుమారు 140 సంవత్సరాల క్రిందకు స్కాట్లండ్ దేశానికి చెందిన వొక కమ్మరి 'బైసికల్' అన్న రెండు చక్రాల బండిని తయారు చేశాడు. ఆ కమ్మరి పేరు కిర్క్‌పాట్రిక్ మాక్మిలన్. ఆనాడాబండిని మాక్మిలన్ తయారు చేసున్నప్పుడు ఉత్తరోత్తరా సాధనంలో చాలా మార్పులొస్తాయని గానీ, ఈ సైకిళ్ళను తయారు చేసే బ్రహ్మాండమైన పరిశ్రమలు అనేక దేశాల్లో తల ఎత్తుతాయని గానీ ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ కొన్ని లక్షల మందికి ఇది జీవనోపాధి కల్గిస్తుందని గానీ ఊహించి వుండడు.

ఆ మాటకొస్తే నూటనలభై సంవత్సరాల క్రిందనే అబ్దుల్‌ఖాన్ తన మునిమనవడి సైకిల్ బాగు చేసుకొని, పొట్ట గడుపుకోవలసి వస్తుందని గూడా ఊహించి ఉండడు. అబ్దుల్‌కాన్‌గారి పూర్తి పేరు యింకా చాలా చాలా పొడుగ్గా ఉంది. సాలార్‌జంగ్ నవాబు పూర్వీకులకు ఈ అబ్దుల్‌గారు చాలా దగ్గర బంధువులు కూడా. ఆస్తిపాస్తులు పంపకాల దగ్గర ఏవో మోసాలు, కుట్రలూ జరగడం వల్ల తన తాతగారికి చాలా అన్యాయం జరిగిందంటాడు మస్తాన్. రాజా కిషన్ ప్రసాద్ హయాంలోనే బోలెడంత పోగొట్టుకున్నామంటాడు మస్తాను. ఆ మధ్య చనిపోయిన ఆఖరి నైజాం నవాబును తను కూడా చాలా సార్లు చూశాడట. అప్పుడప్పుడు విందులకు వాటికీ తను కూడా తండ్రితో పాటు హాజరవుతూ ఉండేవాడట. వెళ్ళిన ప్రతిసారీ 'అష్రఫీ'లు నజరానాగా ఇస్తూ వుండేవాడట. అప్పట్లో తీసిన ఒక తస్వీర్ ఇంకా తన దగ్గర వున్నదన్నాడు. ఇంటికి తీసుకెళ్ళి దాన్ని చూపించాడు కూడా. ఆ ఫొటోలో వున్న మస్తాన్ 'దొరబాబు' లాగా వున్నాడు. మోకాళ్ళ దిగువదాకా షేర్వాన్, నెత్తిమీద కుచ్చుటోపి, చేతిలో చిన్న కర్ర, వీటన్నింటితోనూ, నైజాం నవాబుకు వెనగ్గా రెండవ వరసలో చిట్టచివరగా వున్నది తనేనన్నాడు మస్తాన్. కాస్త పరకాయించి చూస్తే తప్ప ఆ ఫొటోలోని మస్తానూ, మన మస్తానూ వొక్కరే అని మనం పోల్చుకోలేము. ఆ ఫొటోలో ఉన్నవారందర్నీ గురించి చెప్పుకొచ్చాడతను. నిజాం నవాబుకు మరిదగ్గరవాళ్ళు తప్ప మిగిలిన వాళ్ళంతా తిండికీ, గుడ్డకూ యమ చెరపడుతున్నారన్నాడు. నిజానికయితే తనక్కూడా ఏ లోటూ ఉండకూడదట. కానీ తన తండ్రి చనిపోయాక ఆయన ఆస్తినంతా ఇంకెవరో కా జేశారని తనూ, తన తమ్ముడూ ఆ ఆస్తికి వారసులు కారని కోర్టు వారు తీర్పు చెప్పారనీ మస్తాను చెప్పాడు.

"మా అయ్యకు ఇద్దరు ముగ్గురు భార్యలున్నారు. మా అమ్మ మూడవ భార్య. అసలు మా నాన్నకు ముగ్గురు పెళ్ళాల్లేరనీ అవతలి వారన్నారు అనీ, రుజువు కూడా చేశారు" అన్నాడు మస్తాను. తమ తరపున దావా నడవడానిక్కూడా ఎవరూ లేకపోయారుట. తన తల్లి న్యాయమైన భార్య కాదని కోర్టు వారు నమ్మడంతో తామంతా వీధిపాలు కావలసి వచ్చిందన్నాడు మస్తాను.

"ఆ చిన్నప్పటి సంగతులు తలచుకొంటుంటే గుండె పగిలిపోతుందండీ. ఈ చేతుల మీదుగా నవాబుగారికి 'అష్రఫి' లుంచిన వెండిగిన్నెలందించాను. యిదే చేతులతో 5 పైసలూ 10 పైసలూ అందుకొంటున్నాను. ఈ సంగతులెపుడన్నా మా పిల్లలకు చెబితే నమ్మరండి. ఈ ఫొటో మీకు చూపించకపోతే మీరు మాత్రం నమ్ముతారా బాబూ" అన్నాడు మస్తాను.

కొంతకాలంపాటు సనత్‌నగర్‌లో ఉన్న ఓ వర్క్‌షాపులో చిల్లర మల్లర పనులు చేస్తూ వుండేవాడు మస్తాను. తయారయిన వస్తువుల్ని ఖాతాదారులకు ఇచ్చిరావడం, బిల్లుల్ని వసూలు చేసుకురావడం, వర్క్‌షాపుకు కావలసిన సరుకుల్ని తీసుకురావడం ఇదంతా సైకిల్‌మీదనే చేస్తుండేవాడు. వయస్సు మళ్ళడం వల్లా, ఉన్న వయసులోనైనా కడుపునిండా తిండిలేకపోవడం వల్లా మైళ్ళకుమైళ్ళు సైకిల్ మీద తిరగలేక ఆ ఉద్యోగాన్ని మానేశాడు. ఓ నెల రోజులపాటు తన సైకిల్ బాగు చేయించుకొంటూ వుండే రాజయ్య దగ్గర కూచుని పనులన్నీ నేర్చుకొన్నాడు.

"ఆ తరువాతనే సొంతంగా ఈ దుకాణం ప్రారంభించాను. మొదట్లో నాకంతగా గిరాకీ వుండేది కాదు. క్రమంగా యాపారం పెరిగింది. ఇప్పటికీ పెద్ద పెద్ద పనులేమన్నా వస్తే మోటారు సైకిళ్ళ పనులు రాజయ్య దగ్గరకు తీసుకుపోతా. ఇద్దరం కలిసి చేసుకుంటాం. చెరికాస్త తీసుకుంటాం" అన్నాడు మస్తాను.

మామూలు పంచర్ వేస్తే 25 పైసలు, బరస్ట్ అయితే, వల్కనైజింగ్ చేయడానికి 40 పైసలనుండి రూపాయి దాకానూ వసూలు చేస్తానన్నాడు మస్తాను. "చక్రాల తెటుకు తీయడానికి 10 నుండి 15 పైసల దాకా తీసుకుంటానండి. గాలికొడితే 'పయ్యా'కు 3 పైసలుండేది. ఇప్పుడు 5 పైసలు చేసినా, సైకిల్ రిక్షా 3 పయ్యలకూ గాలి కొట్టినా 10 పైసలే తీసుకుంటానండీ, వాళ్ళే గొడ్డుచాకిరీ చేస్తుంటే వాళ్ళను పిండుకొని బాగుపడేదేంటి బాబూ! చువ్వలేస్తే ఒక్కోదానికి 10 పైసలు, వాల్‌ట్యూబ్ బిగించి గాలికొడితే 10 పైసలూ, బ్రేకులు సరిచేస్తే రూపాయి రూపాయిన్నర తీసుకొంటాను. మొత్తం సైకిల్ విప్పదీసి కిరసనాయిల్లో నానేసి మళ్ళీ బిగిస్తే 8 రూపాయల నుండి 10, 12 దాకా తీసుకొంటా" అన్నాడు మస్తాను. చక్రం బెండింగు తీయడం, చైన్ కొక్కెం వూడదీసి మళ్ళీ రివైట్ చేయడం. హాండిల్‌బార్ సొట్టను తీయడం, విరిగిపోయిన చోట అతకడం ఇలాంటి పనులన్నీ తను స్వయంగానే చేస్తానన్నాడు మస్తాను.

"ఏం చేస్తే ఏముందిలెండి, ఒక్కోపాలి పస్తులే వుండాలిసొస్తుంది. ఎండాకాలం మిటమిటలాడే అగ్గిలో వుండాల్సిందేనండీ. పంచరువేసే పని అప్పుడే కాస్త ఎక్కువగా వుంటుంది. వానాకాలంలో బ్రేకుల్ని బాగు చేయడం ఎక్కువగా ఉంటుందండీ. ఏం చేసినా ఆరు ఏడు కన్నా ఎక్కువ రాదండి. ఒక్కో రోజున రెండు మూడు దొరకడం కూడా కష్టమేనండి" అన్నాడు మస్తాను. ఇది వరకు కొడుకుచేత కూడా చిన్న యాపారం చేయించేవాడు మస్తాను. చిన్న చిన్న సీసాలనిండా నూనె నింపుకొని సైకిల్ దీపాలకు పోస్తూ వుంటే రోజుకు ఓ అర్ధరూపాయి డబ్బులు ఢోకా లేకుండా దొరుకుతుండేవి. డైనమోలు, బ్యాటరీలైట్లు పెరగడం వల్లా కార్పొరేషన్ వాళ్ళు దీపాలు వుండవలసిన అవసరం లేదని రూల్సు చేయడం వల్లా ఆ బిజినెస్ కాస్తా మూలబడిపోయింది. ఆ రోజుల్లో కూడా పోలీసువాళ్ళ బాధ మస్తానయ్యకు తప్పలేదట. ఫ్రీగా నూనె పొయ్యకపోయినా, రిపేరు చేయకపోయినా న్యూసెన్సు కేసు పెట్టి చంపుతుండేవారట. అప్పుడంత బాధ లేదన్నాడు. ఎందుకనో, కారణం తను చెప్పలేనన్నాడు మస్తాను.

ఇది వరకు ఏ.జి.ఆఫీసు దగ్గరే వుండేవాడట. ఈ మధ్యనే నాంపల్లికి మారాడట, ' "ఈ మారడానిదేముందిగానీ అసలు రాత మారాలండీ. ఇన్నేళ్ళ నుండి చూస్తున్నా, అది చేస్తాం ఇది

చేస్తాం అంటారేగాని చేసినవాడెవ్వడూ లేడు. ఇక ముందు కూడా ఎవ్వడూ ఏదీ చెయ్యడు. ఓట్లప్పుడు ఏందేందో చెబుతారు. మళ్ళా కన్పించరు'' అని నిట్టూర్చాడు మస్తాను.

అతనికి ఆరుగురు ప్లిలలు. ఇద్దరు ఆడపిల్లలకు పెళ్ళిళ్ళుచేశాడు. ఒక అల్లుడు చెప్పుల దుకాణంలో పనిచేస్తున్నాడని, ఇంకో అల్లుడు రిక్షా తొక్కుతున్నాడనీ చెప్పాడు. పెద్ద కొడుకును మౌలాలి దగ్గరున్న ఓ బిస్కెట్ల ఫ్యాక్టరీలో ఉంచాడట. వాడు తిన్నగా పనిచేసినా జీతం మాత్రం ఇంట్లో ఇవ్వడట. ''సోకులు ముదిరినయ్యండి. పాంట్లు తొడుగుతాడు. నలన కళ్ళజోడు పెడతాడు. సినిమాలు చూస్తాడు. అప్పుడప్పుడూ చెడతాగి ఇంటికొస్తాడండి'' అని కన్నీళ్ళు పెట్టుకున్నాడు మస్తాను. పొద్దున్నుంచి రాత్రి 8, 9 గంటదాకా ఉంటా. ఇదివరకయితే సామానంతా ఆ పెట్టెలోకి సర్ది ఇంటికి తీసుకుపోతుండేవాణ్ణి. అప్పుడు పాత సైకిలుండేది లేండి. రెణ్ణెల్లకింద దాన్ని 'గిరవీ' పెట్టి పది రూపాయలు తెచ్చిన- మా ఆడాళ్ళకు జబ్బు చేస్తే. ఇంకా యిడిపించలేదండి. దొరికింది దొరికినట్టుగా పొట్టకే చాలకపోతుంటే ఇంకా తాకట్టు ఏంబెట్టి ఇడిపించుకుంటానండీ అదట్టా 'ఖతం' కావలసిందేనండీ'' అన్నాడు మస్తాను దిగులుగా.

తన చిన్నతనంలో వెండిపాత్రలో 'అష్రఫీలు' అందించిన మస్తాను ఇప్పుడు అరకొరతిండితో అసులుసులుగా కాలం వెళ్ళదీస్తున్నాడు. అతనికి గతం తప్ప వర్తమానంలో ఆశలేదు. భవిష్యత్తులోనైనా అతని బతుకులో ఇంత ఆశా రేఖను చూపగలవారెవరన్నా వున్నారా!